# ప్రజలను కట్టువారు

# (4:29-32)

సంవత్సరాల తరబడి ప్లానింగు, కట్టుబడి జరిగిన తరువాత, ఆర్లింగ్‌టన్, టెక్సాస్‌లో యిటీవల బేస్‌బాల్ పార్కు తెరువబడింది. కొద్ది వారాలవరకు పాత బేస్‌బాల్ పార్కు క్రొత్తదాని ప్రక్కనే ఉండింది. చివరిగా అది పడగొట్టబడినప్పుడు, వార్తా పత్రికల్లో పడగొట్టబడినదాని కడపటి భాగం చూపించబడింది. అది నాకు జీవితపు ప్రాథమిక సూత్రాన్ని గుర్తు చేసింది: కట్టడానికి పట్టినంత కాలం పడగొట్టడానికి పట్టదు.

పౌలు వ్రాసిన ఈ మాటల ద్వారా దేవుడు ఈ సత్యాన్ని మనకు జ్ఞాపకం చేస్తున్నాడు:

> వినువారికి మేలు కలుగునట్లు అవసరమునుబట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూల వచనమే పలుకుడి గాని దుర్భాషయేదైనను మీ నోట రానియ్యకుడి. దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచనదినమువరకు ఆయనయందు మీరు ముద్రింపబడియున్నారు. సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీరు విసర్జించుడి. ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణాహృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి (4:29-32).

సంఘము మనుష్యులను కట్టే పనిలో ఉండాలని దేవుడు కోరుకుంటాడు.

4:29-32 అనే మన లేఖన భాగము, ప్రభువైన యేసువలె ఉండడానికిని, జనులను నిర్మించేవారుగా రూపొందడానికిని రెండు ప్రాముఖ్యమైన పరిధుల్లో దృష్టిని నిలుపుతోంది: మన మాటలు మరియు మన చర్యలు.

## ప్రజలను కట్టు మాటలు

క్రైస్తవులుగా మనం మన మాటలను కాచుకోవలసియుంటుంది. మన మాటలను కాచుకునే ఒక విధానమేమంటే - "దుర్భాషయేదైనను" మీ నోట రానియ్యకుండడం (4:29). ఆంగ్లంలో దీన్ని "రోగము కలిగించెడి" అని ఉంది. రోగం కలిగించెదు అనేదానికి వాడిన గ్రీకు పదం మురిగిపోయిన లేక చెడిపోయిన భోజనాన్ని వర్ణించడానికి ఉపయోగించబడుతుంది. చెడిపోయిన అన్నం, కూరల విషయం మనకు తెలియనిది ఏమీ లేదు. పాడైన అన్నం తిని ఆస్పత్రి పాలయ్యేవారిని గూర్చి మనం తరచుగా వార్తలలో వింటూనే ఉంటాం.

అలా పాడైన ఆహారం మన నోటిలో పెట్టుకొనడానికి ఎవరమూ యిష్టపడం. దాన్నిగూర్చి ఆలోచించడమే మనకు అసహ్యంగా ఉంటుంది. అయితే దేవుని దృష్టినుండి

చూస్తే, ఆలాటి చెడిపోయిన అన్నం మన నోటిలో పెట్టుకొనడానికి తరచుగా అనుమతించుతాం. ఒకడు మొరటైన పరిహాసం చెప్పినప్పుడు, లేదా ముసలమ్మ ముచ్చటలను వ్యాపింపజేసినప్పుడు, అట్టివాడు మురిగిపోయిన – చెడిపోయిన దానిని తన నోట ఉంచుకుంటున్నాడు.

మన మాటలు ఎలా ఉండాలి? పౌలు యిచ్చిన మూడు దారి చూపులను గమనించు, **మొదటిది, మన మాటలు నిర్మించేవిగా ఉండాలి.** "వినువారికి మేలు కలుగునట్లు క్షేమాభివృద్ధికరమైన అనుకూల వచనమే" పలకడానికి మనకు స్వాతంత్ర్యముంది (4:29బి). ఇతరులలో ఉన్న అతి శ్రేష్ఠమైనదాన్ని వెలుపలికి తెచ్చేవారుగా క్రైస్తవులుండాలి.

**రెండవది, మన మాటలు తగినవిగా ఉండాలి.** అవసరానికి తగినవిగా "అనుకూల వచనమే" అంటే అర్థం అదే (4:29సి). మనం మన మాటలు ఎన్నుకునేటప్పుడు ఇతరులకు క్షేమాభివృద్ధి కలగాలనేదే మన ఉద్దేశమైయుండాలి.

**మూడవది, మన మాటలు కృపా సహితముగా ఉండాలి.** ఇతరులతో మనం మాట్లాదే టప్పుడు, బైబిలు మనకొక ఉద్దేశాన్ని యిస్తుంది: "వినువారికి మేలు కలుగునట్లు" ఉండాలి (4:29డి). మనం మాట్లాడే మాటల ద్వారా దేవుడు తన కృపను యితరుల జీవితాల్లో కుమ్మరిస్తాడు. సొలొమోను యిలా అన్నాడు: "సమయోచితముగా పలుకబడిన మాట చిత్రమైన వెండి పళ్లెములలో నుంచబడిన బంగారు పండ్లవంటిది" (సామెతలు 25:11).

నీ మాటలు ఎంత ప్రాముఖ్యమైనవి? పరిశుద్ధాత్మ యొక్క ఉద్వేగాన్ని రంగంలోనికి దింపి దీని విషయమై పౌలు మనో నేత్రాలను వెలిగింప సహాయం చేస్తున్నాడు. "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచనదినమువరకు మీరు ఆయనయందు ముద్రింప బడియున్నారు" (4:30). పలు విధములైన చర్యలు పరిశుద్ధాత్మను దుఃఖపరుస్తాయి. వాటిలో ఒకటి దుర్భాషలను ఉపయోగించడం. మనం నిలిచేదాని కంతటికి వ్యతిరేకంగా అవి ఉంటాయి. కాబట్టి, అప్పుడు మన మాటలను కాచుకొనడం చాలా ప్రాముఖ్యం.

నీ భార్యతోగాని, భర్తతోగాని ప్రోత్సాహకరమైన మాటలే మనం పలికినట్టయితే, నీ వైవాహిక జీవితం ఎంత వ్యత్యాసంగా ఉంటుందో? నీ పిల్లలకు అవి ఎంత ఆరోగ్యకరమైన భోజనంగా పని చేస్తాయో? సభ్యులందరు దుర్భాషలు మాని, ఒకరినొకరు బలపరచుకునే మాటలనే పలుకుతుంటే, స్థానిక సంఘంలో ఎంతటి వ్యత్యాసం కనబడుతుందో?

## ప్రజలను కట్టే కార్యములు

మన మాటలతోపాటు, మన కార్యములు లేక చర్యలు ప్రజలను కట్టవలసి ఉంటుంది. అందులో యితరుల యెడల అనుకూలంగా ఉండడం మాత్రమేగాక, ప్రతికూలంగా ఉండ నిరాకరించాలి.

**ప్రతికూలమైన చర్యలు లేకుండ చూడు.** ప్రజలకు హాని కలిగించే ప్రతికూలమైన చర్యలను లేకుండేలా క్రైస్తవులు చూచుకోవాలి. 4:31లో, ఈ క్రింది చర్యలకు వ్యతిరేకంగా పౌలు హెచ్చరించాడు, గమనించు:

1. "ద్వేషము" –

ఇతరులయెడల ఒక వ్యక్తిని యిష్టం లేకుండ కఠినపరచేది

2. "కోపము" –
   దీర్ఘకాలపు, లోతుగా పాతుకుపోయిన శత్రుత్వము
3. "క్రోధము" –
   ప్రజలకు వ్యతిరేకంగా త్రిప్పబడిన, తటాలున, మండిపడడం
4. "అల్లరి" –
   కోపగించుకొని యితరులపై ఎగరడం
5. "దూషణ" –
   ఇతరుల గౌరవాన్ని పాడు చేయడానికి వ్యాపింపజేసే పుకారులు
6. "దుష్టత్వము" –
   ఎవరికేని హాని కలిగించడానికి చేసే బహిరంగ ప్రయత్నం

నీ యింటిని నీవు ఎన్నడు శుద్ధి చేసుకొనకపోతే, అది దరిద్రంగా తయారౌతుంది. ఇంటిని శుభ్రం చేసుకొనడం అంటే, చెత్తాచెదారం లేకుండా చూచుకొనడమే. మన జీవితాలు చెరపబడకుండేలా కొన్ని కార్యాలను తొలిగించుకోవాలని పౌలు తెలియజేశాడు.

**అనుకూల కార్యాలను జరిగించు.** తొలిగించుకోవలసిన కార్యాలను పౌలు పేర్కొన్న తరువాత, అనుకూలమైన మూడు కార్యాలు జరిగించవలసిందిగా పౌలు తెలిపాడు:

1. "దయకలిగి"యుండు –
   ఇతరులలో ఉండే శ్రేష్ఠమైనదానిని వెలికి తెచ్చేలా చేసే ప్రతిదానిలో వారి యొక్క శ్రేయస్సునే కోరుతూ ఉండు
2. "కరుణా హృదయులై"యుండి –
   ఇతరుల అవసరాలకొరకు తెరువబడిన హృదయం, స్పందించే హృదయం కలిగియుండు
3. "క్షమించుతూ" ఉండు –
   నీవు తప్పిపోయిన విషయాల్లో దేవుడు నీకు ఏమి చేయగోరతావో యితరులకు నీవు అదే చేయి

తాను తప్ప ప్రతి ఒక్కరు చెవిటివారైయున్న యింటిలో ఛాన్స్ అనే ఒక యువకుడు పుట్టాడు. తన కుటుంబంతో ఎవరూ "హాపీ బర్త్‌డే" అని అతనికి చెప్పినవారు లేరు. అతడు ఆటలు ఆడేటప్పుడు అతని తండ్రి అతనితో ఎన్నడూ ప్రోత్సాహపు మాటలు పలుకలేదు. తల్లిదండ్రుల నిశ్శబ్దపు ప్రపంచంనుండి అతడు ఒకవిధంగా దూరం చేయబడినట్టున్నాడు. ఒత్తిడిని అతడు సరిగ్గా భరించలేకపోయాడు. బాగా త్రాగుతూ, స్కేటింగ్ ఆడే సాటి యువకులతో అతడు జతకూడాడు. తల దువ్వుకోకుండాలని కోరుకున్నాడు. చింపిరి గుడ్డలు తొడుగుకుంటూ, తోలు గ్లోవ్స్ తొడుక్కునేవాడు. ఛాన్స్ యొక్క పరిస్థితి మెరుగుపడేలా లేదు. ఏదియెలాగున్నా, ఛాన్స్ ఒక అసాధారణమైన స్థానిక సంఘానికి వెళ్లుతుండేవాడు. అక్కడున్న యౌవనస్థులను "చెరుపుతాడేమో" అని భయపడకుండ, ఆ స్థానిక సంఘంలోని సభ్యులు అతన్ని ఎల్లప్పుడు ఆహ్వానిస్తున్నట్టే అతని భావింపజేశారు. అతన్ని ప్రేమించి అతన్ని అర్థం చేసికొనడానికి ప్రయత్నించారు.

వారు అతని పక్షంగా నిలిచారు. దయగలిగి అతని నడిపించే బాధ్యతను వారు అంగీకరించారు. కొన్ని సార్లు అతన్ని ఎదుర్కోవలసి వచ్చినా వారు ఆ పని చేయబూనుకున్నారు. వారు అతనికి బోధించిన తీరు, తనతో వారు కనుపరచిన వారి వైఖరి, వారి నిష్కపటమైన ప్రేమను అతనికి అందించింది.

ప్రేమ పూర్వకమైన వారి విధానము కడకు క్రైస్తవుడయ్యేలా ఛాన్స్‌ను నడిపించింది. కేవలం అతడు లెక్కకు మాత్రమే క్రైస్తవుడో లేక నలుగురితో ఒకడుగానో ఉండిపోలేదు. కడకు అతడు ఒక క్రైస్తవ విశ్వవిద్యాలయంలో చేరి పరిచర్యకు తర్ఫీదు పొందేవాడయ్యాడు.

ప్రతి స్థానిక సంఘం ప్రతి ఒక్కరితో చేయవలసినట్టుగా, ఛాన్స్ వెళ్లిన స్థానిక సంఘం మాటల ద్వారాను, క్రియల ద్వారాను అతనితో సందేశం అందజేసేదిగా మసలుకుంది: "ఒక వ్యక్తి ఎంత చిన్నగా, బలహీనంగా, బాధింపబడినవాడిగా ఉన్నా, స్థానిక శరీరంలోని ప్రతి విశ్వాసపు అవయవం (సభ్యుడు) లెక్కింపబడినవాడైయుంటాడు."[1]

నీవు ఆరాధించే స్థలంలో, ఛాన్స్‌లాటి ప్రజలు భాగమైయున్నారా? "అవును" నీవు తల ఆడించేటప్పుడు, వారి ముఖాలను గూర్చి నీవు ఆలోచించు. వారిని నీ మనస్సులో ఉంచుకో. మనుష్యులను కట్టువారినిగా దేవుడు మనకు ఎందుకు పిలుపునిచ్చాడో వారి స్వరూపాలే మనకు తెలియజేస్తాయి.

## ముగింపు

"జనులను నిర్మించేవారికి" పౌలు యిచ్చిన సందేశానికి నీవు ఎలా (రియాక్ట్) స్పందిస్తావ్? నీవు నీ మాటలను జాగ్రత్తగా ఉంచుకుంటావా? ప్రజలతో నీవు మాట్లాడే మాటలు ఆత్మ సంబంధంగా వారికి ప్రయోజనకరంగా ఉండేలా చూచుకుంటావా? స్థానిక సంఘం యొక్క వాతావరణం ఆరోగ్యకరంగాను నిశ్చయమైనదిగాను ఉండేలా చూడడం నీ జీవితానికి ప్రధానంగా ఉండేలా చూచుకుంటావా? అవును, జనులు పాపానికి దూరంగా ఉండాలని మనం కోరుకుంటాం, అయితే మనం వారికి సహాయపడే పద్ధతి విజయం అపజయమనేవాటికి మధ్య వ్యత్యాసాన్ని కలిగించవచ్చు.

అభ్యాస సంబంధమైన రెండు సలహాలు సహాయపడవచ్చు: **మొదటిది, జనులను ఎలా కట్టాలి అనేదానికి నీకు మాదిరిగా ప్రభువైన యేసువైపు చూడు.** తిరిగి సువార్త రచనలు చదవడం మొదలుపెట్టు. ప్రజలతో ప్రభువు సంధించే విధానాన్ని గమనించు. **రెండవది, ఇప్పటినుండి ఆరంభించి ప్రోత్సహించడం నీ ప్రాధాన్యతగా ఉండేలా తీర్మానం చేసికో.** కొందరికి ప్రోత్సహించే మాటలు సహజంగానే పొర్లి వస్తాయి. మనలో ఎక్కువ మందికైతే ఎరిగి ప్రయాసపడడం అభ్యసించడం అవసరమైయుంటుంది. కాని "ప్రజలను కట్టువారిగా" మనం ఉండాలంటే మనం తీసికొనే ప్రయాస అంతా విలువైనదే.

---

సూచన

[1]David K. Lewis, Carley H. Dodd, and Darryl Tippens, *Dying to Tell: The Hidden Meaning of Adolescent Substance Abuse* (Abilene, Tex.: ACU Press, 1992), 101-2.